క్లుప్తంగా

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కార్యకర్తలతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముక్కపల్లి కనకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, నాయకులు సత్తు రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ధార స్వామి, మల్లయ్య, రమేష్, బాల్‌రెడ్డి, చంద్రం, నవీన్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిని కరీంనగర్‌లో చేర్చాలి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో చేర్చాలని కోరుతూ ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్, టీజేఏస్ రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్, నాయకులు ర్యాకం రాజు, ఉప్పలేటి శ్రీను, గాదెం మల్లికార్జున్ శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అలాగే మండల కేంద్రంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి, ఎల్‌పీఎస్ భూములపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



పాత్రలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ తోడేటి రమేశ్ అన్నారు. శుక్రవారం పందిల్లలో వైద్య సిబ్బందితో కలిసి డ్రై డే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లిన వైద్య సిబ్బంది వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వర్షం నీరు నిల్వ ఉంటే దోమలు చేరి వాటితో అనారోగ్యం బారిన పడతారని చెప్పారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు



హరీశ్‌రావుతో దుబ్బాక నాయకులు

దుబ్బాకటౌన్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును దుబ్బాక మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండు భూపేశ్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేటలో వరుసగా 7వ సారి భారీమెజార్టీతో గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను 'సీఈఐఆర్' టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన అరకాల కనకరాజు రియల్‌మీ కంపెనీ ఫోన్‌ను అక్టోబర్ 16వ తేదీన పోగొట్టుకున్నాడు. బాధితుడు సంబంధిత వెబ్‌సైట్‌లో సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఎంటర్ చేసి బ్లాక్ చేశాడు. ఫోన్ దొరికిన వ్యక్తి సెల్‌ఫోన్‌లో సిమ్‌కార్డు వేయగానే వెబ్‌సైట్ ద్వారా వివరాలు స్థానిక పోలీసులకు చేరాయి. వెంటనే వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

డ్రగ్స్ కలకలం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామ శివారులో డ్రగ్స్‌ను తయారు చేస్తుండటం కలకలం రేపింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్, నిర్మల్‌గౌడ్, శివశంకర్‌గౌడ్ డ్రగ్స్ తయారీ వ్యవహారంలో ఉండటంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. ఓ పార్టీకి చెందిన ముఖ్య అనుచరులు ఈ డ్రగ్స్ దందా నడుపుతున్నారని మండల వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. డ్రగ్స్ తయారీకి సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు గ్రామస్తులు వెనకాడుతున్నారు. ఈ డ్రగ్స్ దందా వ్యవహారం మరికొందరు నాయకుల మెడకు చుట్టుకుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

యాసంగి సాగుకు సన్నద్ధం



వరి సాగుకు పొలాలు సిద్ధం చేస్తున్న రైతులు

- వరిసాగు వైపు రైతుల చూపు
- పెరిగిన భూగర్భజలాలు

చిన్నకోదూరు(సిద్దిపేట): యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు సాగు చేద్దామంటే కోతుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో వరి సాగు చేయడానికి పొలాలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం నారుమళ్లు పోస్తున్నారు.

70 శాతం వరి వైపే..

మండలంలో ప్రధానమైన రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఉండడంతో గ్రామాల్లో చెరువులు, కుంటలు నీటితో నిండుకున్నాయి. మండలపల్లి వాగు చెక్ డ్యాంలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో సాగు నీరుకు ఢోకా ఉండదని చాలా మంది రైతులు చెబుతున్నారు. ఇప్పటికే 70 శాతం మంది రైతులు వరి సాగుకు సిద్ధం కాగా వరి నారుపోసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో 29 వేల ఎకరాల సాగు భూమి ఉండగా.. వానాకాలంలో 18,950 ఎకరాల్లో వరి సాగు చేశారు. యాసంగిలో 16,500 ఎకరాలు వరి సాగు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. కాగా కూరగాయలు, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు 400 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే వ్యవసాయ అధికారులు ముందస్తుగా గ్రామాల్లో యాసంగి సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించినా. ఈఏడాది భూగర్భజలాలు పెరగడం, నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందనే ధీమాతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచిస్తున్నాం. అంతేకాకుండా కూరగాయలు, మొక్కజొన్న సాగు చేయాలని వివరిస్తున్నాం. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

– జయంత్ కుమార్, ఏఓ

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్‌రావు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి ఒక్కరికి చట్టాల గురించి తెలిసి ఉండాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్స్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు మగవారితో పోటీపడి ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. కష్టపడి చదవాల్సిన వయసులో చెడు అలవాట్లకు బానిస కావొద్దని సూచించారు. షీటీమ్ కంప్‌లైంట్ క్యూఆర్ కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచి అయిన ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు మహేష్, వివేక్, కేజీబీవీ బాలికల పాఠశాల ప్రత్యేకాధికారి సరిత, షీటీం బృందం సదయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాపై ఫిర్యాదు

శివ్వంపేట(నర్సాపూర్): సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో భూ కబ్జాపై ఫిర్యాదు చేసినట్లు ఓ రైతు తెలిపాడు. తనది మండలంలోని కొంతన్‌పల్లి గ్రామమని గొల్ల శివయ్య తెలిపాడు. కాగా వంశపారపర్యంగా గ్రామ పరిధిలో పంటలు సాగు చేసుకుంటున్న సర్వే నంబరు 349 లోని సర్వేనంబరు 1-37 గుంటల భూమిని బీఆర్ఎస్ నాయకుడు కబ్జా చేశాడని సీఎంకు వివరించినట్లు చెప్పాడు. భూ కబ్జాపై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపాడు.

'పొన్నం'కు మంత్రి పదవిపై హర్షం



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు లింగమూర్తి

హుస్నాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. శనివారం అన్ని మండల కేంద్రాల్లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. అలాగే ఉదయం 7 గంటలకు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బస్సు సౌకర్యం ఉన్న అన్ని గ్రామాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన కల్పించాలని కోరాడు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, యాదవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బంక చందు, నాయకులు లింగారెడ్డి, రాకేష్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



దుబ్బాక: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీఓ భాస్కరశర్మ, తదితరులు

దుబ్బాక/కొండపాక(గజ్వేల్)/దౌల్తాబాద్: దుబ్బాక ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. దుబ్బాక మండలం పోతారంలో ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది, వంద పడకల ఆస్పత్రి సిబ్బంది నూతన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, సిబ్బంది, ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండపాక బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లికి చెందిన వేమ నాగరాజు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ వేమ జనార్ధన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

తొగుట(దుబ్బాక)/మిరుదొడ్డి: దుబ్బాక ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని మండలంలోని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సహకారంతో దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అనితా లక్ష్మారెడ్డి, కనకయ్య, డైరెక్టర్ రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో ఇటీవల మృతిచెందిన బత్తుల జీవానందం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

ట్రెక్కింగ్ క్యాంపులో ఎన్‌సీసీ కాడెట్లు



ఎన్‌సీసీ కాడెట్లను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గజ్వేల్‌రూరల్: ట్రెక్కింగ్ క్యాంప్ తమకు ఎన్నో అంశాలను నేర్పించిందని, ఈ క్యాంపు వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందిందని ఎన్‌సీసీ కాడెట్లు పేర్కొన్నారు. 2టీ బెటాలియన్ సికింద్రాబాద్‌కు చెందిన ట్రెక్ 23లో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని సేయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సీపీఎల్ సాయిచరణ్, ఎన్‌సీపీఎల్ శౌర్య చైతన్య నవంబర్ 5వ తేదీ నుంచి డిసెంబర్ 5 వరకు గుజరాత్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ క్యాంపులో ఎన్‌సీసీ కాడెట్ల బాధ్యతల గురించి తెలుసుకుంటూ వివిధ ప్రాంతాల్లో ట్రెక్ నిర్వహించారు. ఈసందర్భంగా శుక్రవారం సేయింట్ మేరీస్ పాఠశాలలో క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ కాడెట్లను ఆ పాఠశాల డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్ప అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు సహించం



నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని 76 సర్వే నంబరులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, సొంత భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. సొంత భూమిలో నిర్మాణాలకు నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే అనుమతులు వస్తాయన్నారు. వారి వెంట మండల ఆర్ఐ ఫైజల్ తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బస్సు దగ్ధం

మునిపల్లి(అందోల్): ప్రమాదవశాత్తు బస్సు దగ్ధమైన సంఘటన మండలంలోని బుదేరా గ్రామ శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ నుంచి షిరిడి వెళ్తున్న ఎస్‌వీఆర్ ట్రావెల్స్ బస్సు మునిపల్లి మండలం బుదేరా మహిళా డిగ్రీ కళాశాల సమీపంలోకి రాగానే బస్సులో టెక్నికల్ ప్రాబ్లమ్ వచ్చింది. దీంతో గమనించిన డ్రైవర్, క్లీనర్ బస్సు వెనకభాగం చూడగా మంటలు ఉండడంతో బస్సులో ఉన్న 38 మంది ప్రయాణికులను బస్సులో నుంచి దింపారు. బస్సు డ్రైవర్ సుభాష్ డిగే ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఈ– కేవైసీ చేయించుకోవాలి**

తొగుట(దుబ్బాక): ప్రధానమంత్రి ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు పొందిన లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకోవాలని దుబ్బాక మణికంఠ గ్యాస్ ఎజెన్సీ మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొగుట, దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, భూంపల్లి అక్బర్‌పేట, రాయపోల్ మండలాల్లోని లబ్ధిదారులు ఈనెల చివరి వరకు ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

◆ **అనారోగ్యంతో కోఆప్షన్ సభ్యుడి మృతి**



ములుగు(గజ్వేల్): ములుగు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాజాపాష (65) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబీకులు ఆయన అంత్యక్రియలను ములుగులో నిర్వహించారు. ఖాజపాష మృతిపట్ల ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జహంగీర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

◆ **ఆర్థిక సహాయం**

మద్దూరు(హుస్నాబాద్)జకొండపాక(గజ్వేల్): మండలంలోని సలాఖాపూర్‌కు చెందిన గడిపే ఐలవ్వ ఇటీవల మృతిచెందగా గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన సంపంగి కనకవ్వ మృతి చెందగా సర్పంచ్ మిట్టపల్లి వసంత అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం 50 కిలోల బియ్యం అందజేశారు.

◆ **పరామర్శ**

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి సర్పంచ్ సద్ది రాజిరెడ్డి తల్లి వజ్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ఓదార్చారు.

ఘనంగా శేరారయ జాతర

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘణాపూర్ గ్రామంలో శ్రీ శేరారయ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి గురువుగా భావించే శేరారయ ఉత్సవాలు మూడు రోజులపాటు జరపడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా రాత్రి రథోత్సవం నిర్వహించారు. యువకులు స్వామి వారి రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. మఠం నుంచి స్వామి వారి సమాధి వద్దకు ఊరేగింపు కొనసాగింది. శనివారం స్వామివారి పల్లకీ సేవ (శవ) కార్యక్రమం జరగనుంది.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

నారాయణఖేడ్: ఖేడ్‌లో శుక్రవారం స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుశాఖ సౌజన్యంతో బ్లడ్ డోనర్స్ గ్రూపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు మాధవికోటం మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడం హర్షణీయం అని తెలిపారు. బ్లడ్‌డోనర్స్‌గ్రూపు సభ్యులు ముజాహెద్‌చిస్తీ, బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నల్లగండ్లలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులతో క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల మధ్య మరింత ఐక్యత, స్నేహాన్ని పెంచాలనే లక్ష్యంతో తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు వివిధ కాలనీలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎనిమిది రకాల క్రీడా పోటీలు ఉంటాయన్నారు. 700 మంది క్రీడాకారులకు పైగా ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విలువలతో కూడిన విద్యయే లక్ష్యం



మహా విష్ణు హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కొండపాక(గజ్వేల్): విలువలతో కూడిన విద్యను అందించడమే సత్యసాయి ప్రశాంతి నికేతనం లక్ష్యమని కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమా పేర్కొన్నారు. కొండపాక గ్రామ శివారులోని ఆనంద నిలయం సమీపంలో నిర్మించిన సత్యసాయి ప్రశాంతి నికేతనం మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం మహా విష్ణు హోమం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్ణిమా మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం మహావిష్ణు హోమం నిర్వహించామని తెలిపారు. సనాతన ధర్మాలు, ఆధ్యాత్మికత తెలిసి వచ్చేలా సద్గురు మధుసూదనా సాయి ఆశీస్సులతో ప్రతీ నెల మహా విష్ణు హోమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓం సాయి పేయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కవిత, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ రాధిక, కళాశాల ఆధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మునగ తోటలకు తీవ్ర నష్టం



రామంచలో మునగతోటలో నేల రాలిన పూత

చిన్నకోదూరు(సిద్దిపేట): తుపాన్ ప్రభావంతో మండల పరిధిలోని రామంచ, చిన్నకోదూరులో మునగ తోటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత నల్లబడి నేల రాలిపోయింది. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు తీవ్ర ఇబ్బంది పడుతూ తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కోతదశకు చేరుకున్న వరి పంట చేనులోనే ఉండడంతో వర్షాలకు నేలరాలి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలో రోడ్లు, తాగు నీరు, విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక శుక్రవారం ఖేడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పులు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పనులు ఉత్తర్వులకే పరిమితం అయ్యాయని తెలిపారు. మూడేళ్లుగా బిల్లులు పెడింగ్‌లో ఉండడం ద్వారా పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకురాక పోగా చిన్నచిన్న పనులు చేసిన సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారని వాపోయారు. ఉపాధ్యాయుల నియామకాలు లేక చాలా తండాల్లో పాఠశాలలు మూతపడగా ఉచిత విద్య అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ చెప్పింది చేసి చూపుతుందని, వంద రోజుల్లో ఆరుగ్యారంటీలతో పాటు మెనిఫెస్టోలోని అంశాలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. 9వ తేదీ నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఖేడ్‌లో తన గెలుపుతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో వచ్చి ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, ముఖ్య నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్ చౌహాన్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గెలుపొందాక శుక్రవారం మొదటిసారిగా నారాయణఖేడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన తల్లి పట్లోళ్ల గాళెమ్మ ఆశీస్సులు పొందారు. కొండాపూర్ హనుమాన్ ఆలయంలో, పట్టణంలోని దర్గాలను దర్శించుకున్నారు.